## మినీకథ



# కానొకటి తలచిన

విజయకుమారి

చిలో పిలో మంటూ చలాకీగా సందడిగా తిరిగే సరోజ ఈసారి సెలవులకి పట్నంనుంచి వచ్చిన దగ్గర్నించీ ఆదోలా ఆందోళనగా వుండటం గమనించాడు శేషు. అంతేకాదు ఏ పొద్దు వీధరుగుమీద విత్తర చూపులు చూస్తూ నిలబడుతుంది. పోస్టుమేన్ కోసమో ప్రియుడి కోసమో మరి!

దీని భావమేమి తిరుమలేశ! దానికింత ఆలోచనేల! మోసపోయింది చిలక రూఢి చేసుకుంటె చాలు రొట్టెవిరిగి నేతిలోపడ్డట్టే. కుక్కని విదిలించినట్లు ఛీ ఛీ అంటున్న చలమయ్యగారి చిలక చేతిలోకొచ్చినట్లే నూతనోత్సాహంతో వుషారుగా ఈలవేస్తూ వచ్చేశాడు శేషు. "సరోజా!" పిలిచాడు ప్రేమగా.

వీధిస్తంభాన్ని కావలించుకుని ఆలోచనల్లో మునిగివున్న సరోజ వులిక్కిపడి చూసింది "నువ్వా! మా నాన్నేమో అనుకుని హడలిపోయాను" అంది.

"సరూ ఎందుకూ నీలో నువ్వే బాధపడతావు. నాకు చెప్పు నిమిషాల మీద చక్కబెడ్తాను" అన్నాడు కాలరు సర్దుకుంటూ.

"నేను బాధపడుతున్నానని నీకెలా తెలుసు బావా!" అంది ఆశ్చర్యంగా. ఎంత తెలివైనవాడు శేషు! చెప్పకుండానే గ్రహించేశాడు. అమ్మకీ. నాన్నకీ చెప్పకు కదా! భయంగా చూసింది.

"అది కూడా పెద్ద బ్రహ్మ విద్యేనా ఏం. సామాన్యంగా కాలేజీలో చదువుకునే అందమైన ఆడపిల్లలందరికీ వుండే సమస్యలే. వూ! అసలు సంగతి చెప్పు. మోసం చేసి నట్లేనంటావా?" చీకట్లో రాయివిసిరాడు తెలివిగా. అంతమాత్రానికి బయటపడుతుందా లేకపోతే.

"అలాగే కనిపిస్తుంది బావా. నీ వెనకే నేనొస్తానన్న మనిషి. నేనొచ్చి వారం దాటుతున్నా యింతవరకూ జాడా జవాబూ లేదు. అంతగా తనకి తీరిక దొరకకపోతే వుత్తరమైనా రాయొచ్చుగదా!"

శేషు ఆనందానికి హద్దు లేకుండా పోయింది: తన అంచనా కరక్టే! పీకలదాకా కూరుకుపోయింది పిల్ల. "నీలాంటి వాజమ్మకి నా పిల్లనిస్తానా! కాలు పట్టుకు ఈడుస్తుంటే చూరుపట్టుకు వేలాడినట్లు ఛీ అన్నా ఛీ అన్నా యిల్లు వదిలిపెట్టవు" అని ఛీదరించుకుంటాడా మేనమామ. వీళ్ళ ఆట కట్టిస్తా.

"అమ్మ సంగతి నీకూ తెలుసుగా బావా. ఆవలిస్తే పేగులు లెక్కపెడుతుంది నాన్నకి తెలిస్తే చంపేస్తాడు. ఎన్నాళ్ళు దాగుతుందీ రహస్యం! ఎక్కడ పసిగడతారో అని హడలి ఛస్తున్నాననుకో" కళ్ళు తుడుచుకుంది సరోజ.

"బుద్ధి గడ్డితినికాదని అనలేకపోయాను. అదేంటో మధు మాట్లాడుతుంటె మత్తుమందు చల్లినట్లే. యిప్పుడేం చెయ్యను బావా?" బేలగా చూసింది శేషు వైపు.

"సరూ నువ్వేం కంగారుపడకు. యివాళే పట్నంవెళ్ళి ఆ మధూ ఎక్కడున్నా సరే లాక్కొచ్చి నీ కాళ్ల దగ్గర పడెయ్యకపోతే నా పేరు ఆదిశేషేకాదు."

సంతోషం దాచుకోలేక పోతున్నాడు శేషు. అమ్మాయిగారి మెడలో మూడు ముళ్లు వెయ్యడం మేనమామ యావదాస్తికి వారసుడు కావడం అట్టె దూరంలో లేదు. అయ్యాకూతురు తననో ఈగనో దోమనో అన్నట్లు చూశారిన్నాళ్లూ. యిప్పుడు నేను గాక దిక్కెవ్వరు.

"నువ్వెంత మంచివాడివి బావా. యిన్నాళ్ళూ తెలిసో తెలియకో ఏదేదో అన్నాను. నన్ను క్షమించు బావా."

"ఛఛ మనలో మనకి క్షమాపణలేంటి సరూ. నేను నీకు పరాయివాడినా. ఏదీ ఆ మధు అడ్రసు యిచ్చి ఏం చెప్పమంటావో చెప్పు" అన్నాడు వుషారుగా.

ఎవరైనా వింటున్నారేమోనని వకసారి అటూ యిటూ చూసి నెమ్మదిగా చెప్పింది సరోజ. "ఎస్. మాధవి. సెకండ్ బి.ఏ. అంటే చాలు బావా ఎవరైనా చెప్తారు కాలేజీలో. హాస్టల్లోనే వుంటుందది ఎక్కడికీ వెళ్ళదు...."

"మాధవా! మధూ అంటే!" అడిగాడు అయోమయంగా.

"అదే నా క్లాస్‌మేట్ మాధవి. మధూ అంటాం. దానికి సమయానికి యింటి దగ్గర్నుంచీ మనియార్డరు రాలేదు ఏం చెయ్యానే యిప్పుడు అని బాధ పడుతుంటే చూడలేక నా బంగారు గాజులు తాకట్టుపెట్టి డబ్బు తెచ్చిచ్చా ఎటూ వారం రోజుల్లో విడిపించుకొస్తానందిగదా అనే ధైర్యంతో. అమ్మకి తెలిస్తే తిడుతుందని రోల్డ్‌గోల్డ్ గాజు లేసుకున్నాన్నేను. యిప్పుడు చూశావా అజా పజాలేకుం...."

కళ్ళు తిరుగుతున్నట్లయి పడిపోకుండా స్తంభాన్ని కావలించుకున్నాడు పాపం శేషు. ●